మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ధర్మవరంలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల పరిశీలన

వాజేడు, మార్చి 21 : వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రతి ఇంటికి నీరు అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అదనపు కలెక్టర్ పీ శ్రీజతో కలిసి తాగునీటి సరఫరాపై మండల స్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే మూడు నెలలు అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. తాగునీటి ఇబ్బందులను గుర్తించి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల ద్వారా అందించాలని ఆదేశించారు. అనంతరం ధర్మవరం గ్రామంలో నిర్మిస్తున్న వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఏప్రిల్ 25లోగా పనులు పూర్తిచేసి ట్యాంకు ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. అలాగే మండలంలోని అయ్యవారిపేట, ధర్మవరం ఇసుక ర్యాంపు నిర్వహణ పనుల్లో తమకు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని భీమారం గ్రామానికి చెందిన గిరిజనులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూ గిరిజనేతరులకు పనికల్పిస్తూ తమను విస్మరిస్తున్న రేజింగ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ర్యాంపు నిర్వహణ జరిగితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, మీకు పని కల్పించేలా చొరవ చూపుతానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీవో స్వరూప, ఎన్పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, డీసీవో సర్దార్ సింగ్, ఎంపీడీవో విజయ, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీపీవో స్వరూపను మందలించిన కలెక్టర్

సమీక్ష సమావేశం సాక్షిగా జిల్లా పంచాయితీ అధికారి (డీపీవో) నాగపూరి స్వరూపను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఘాటుగా మందలించారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు వారిని రిలీవ్ చేయకపోవడంతోపాటు ఐఏఎస్ అధికారి పేరుతో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయడం కోసం డబ్బులు అడగడం ఏంటని ప్రశ్నించారు. గతంలో ఎక్కడ పనిచేశావో ఎలా పనిచేశావో నీ గురించి అంత తెలుసు అంటూ డీపీవోపై మండిపడ్డారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించడంతో పాటు ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించడంతో ఆమె వెనుదిరిగారు.

అర్ధరాత్రి అక్రమ దందా

- మానేరు ఇసుక పట్టణాలకు తరలింపు
- చెక్‌పోస్ట్‌లు ఉన్నా.. నిఘా సున్నా

వాగులో ఇసుకను లోడ్ చేసిన జేసీబీ

లోడ్ చేసిన ఈ ఇసుక డంప్‌లోనే..

టేకుమట్ల, మార్చి 21 : మానేరులో ఇసుక అక్రమ దందా కొనసాగుతున్నది. అర్ధరాత్రి మండలంలోని బూర్నపల్లి- వెంకట్రావ్‌పల్లి గ్రామాల మధ్యలోని మానేరు వాగులో జేసీబీల సాయంతో ఇసుకను లారీల్లో లోడ్ చేసి పట్టణాలకు తరలిస్తున్నారు. బుధవారం రాత్రి 12 గం టల తర్వాత (గురువారం తెల్లవారు జామున 4 గంటల వరకు) రెండు జేసీబీల సాయంతో ఎనిమిది లారీల్లో ఇసుక నింపి నాలుగు లారీలు టేకుమట్ల మీదు చిట్యాల వైపు, నాలుగు లారీలు బూర్నపల్లి- కిష్టంపేట గ్రామాల మధ్య మానేరులో ప్రవేట్ వ్యక్తులు పోసిన దారి (ఈ దారి వెంట వెళ్తే లారీకి రూ.1000 చెల్లించాలి) వెంట పెద్దపల్లి జిల్లా వైపు తరలిస్తున్నట్లు రైతులు తెలిపారు. పది రోజుల నుంచి ఈ తతంగం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక జేసీబీ వాగులో, మరో జేసీబీ ఇసుక డంప్ వద్ద లారీలను లోడ్ చేస్తున్నాయని రాత్రి 100కి డయల్ చేస్తే, స్థానిక స్టేషన్‌కి సమాచారం ఇచ్చి పోలీసులను పంపిస్తామని చెప్పారని, కానీ, ఎవరూ రాలేదన్నారు. దీంతో సీఐకి ఫోన్ చేసి చెప్తే సిబ్బందిని పంపిస్తా అన్నారని, 4 గంటల వరకు రాకపోడంతో లారీలు లోడ్ చేసుకుని వెళ్లాయని రైతు లు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క భూగర్భ జలాలు అడుగంటుంతుంటే వాగులో నీటికోసం బోర్లు వేయలేక అప్పులపాలు అవుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వ క్వారీని కోర్టులో కేసు వేసి ఆపగలిగామని, అక్రమ దందాను మాత్రం ఆపలేకపోతున్నామని చెప్తున్నారు. చెక్ పోస్ట్‌లు ఉన్నప్పటికీ అక్రమ ఇసుక తరలిపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందిం చి, ఇసుక డంప్‌లను సీజ్ చేసి, వాగులోని రోడ్డును తొలగించాలని రైతులు కోరుతున్నారు. గురువారం మధ్యాహ్నం ఎస్సై ప్రసాద్ వాగు, డంప్ వద్దకు వెళ్లి పరిశీలించి రైతులను వివరాలు అడిగితెలుకున్నట్లు సమాచారం.

బాధిత కుటుంబాలకు పరామర్శ

లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

మంగపేట మార్చి 21 : బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు గురువారం మండలంలో పర్యటించారు. తిమ్మంపేట గ్రామానికి చెందిన దంతనపల్లి బుచ్చయ్య మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీ నారాయణ జ్వరంతో బాధపడుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మైనార్టీ నాయకుడు ఇంతియాజ్ బుట్టో ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకోగా పరామర్శించి సూచనలు చేశారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, జిల్లా నాయకులు తాటి కృష్ణ, అయూబ్, ఇబ్రహీం పాషా, చిలకమర్రి లక్ష్మయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎగ్గడి అర్జున్, ముత్తెబోయిన నరసింహారావు, వెంగయ్య, సత్యం, రవి, ముత్తయ్య, తాడూరు రఘు, బాస పుల్లయ్య, ఖలీల్, సారయ్య, చిప్ప నాగరాజు, ముస్తఫా, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జీ గుడివాడ శ్రీహరి, సోషల్ మీడియా గ్రామ ఇన్‌చార్జి పూజారి సతీశ్, కార్యకర్తలు ఉన్నారు.

వాజేడు పీహెచ్‌సీ తనిఖీ

వాజేడు పీహెచ్‌సీ వైద్యుడు, సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వాజేడు, మార్చి 21 : మండలకేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం అదనపు కలెక్టర్ పీ శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల నిల్వలతో పాటు వార్డులను పరిశీలించి వైద్యసేవలపై వైద్యాధికారి మహేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలని సూచించారు. అనంతరం నాగారం పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. ఆమెవెంట ఎంఈవో తేజావత్ వెంకటేశ్వర్లు, ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ సావిత్రి, హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, ఫార్మాసిస్ట్ మనీషా, స్టాఫ్‌నర్సు రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ రజనీకాంత్ వైద్య సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

వెంకటాపురం (నూ) : సూచనలిస్తున్న ఎస్పీ శబరీశ్

వాజేడు/ వెంకటాపురం (నూగూరు), మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ శబరీశ్ వాజేడు, వెంకటాపురం (నూ) మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గురువారం పరిశీలించారు. వాజేడు మండలం మొరుమురు కాలనీ, అరుణాచలపురం, కొంగాల, వెంకటాపురం మండలం రాచపల్లి, మైతాపురం, కమ్మరిగూడెం, వెంకటాపురం పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక పోలీసులకు సూచనలు చేశారు. అనంతరం వాజేడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ములుగు డీఎస్పీ నలువాల రవీందర్, వెంకటాపురం సీఐ బండారు కుమార్, ఎస్సైలు చావళ్ల వెంకటేశ్వర్‌రావు, అశోక్, సిబ్బంది ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి : డీఎల్‌పీవో

మహదేవపూర్, మార్చి 21 : నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో వీరభద్రం సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కుదురుపల్లి జీపీ ఆధ్వర్యంలో చేపట్టిన నర్సరీని ఆకస్మికంగా సందర్శించారు. నర్సరీలో ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తొలగించాలన్నారు. వేసవి దృష్ట్యా షేడ్ నెట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీ మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు నీరందించాలన్నారు. వర్షాకాలం నాటికి నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శి ఇందిర, జీపీ సిబ్బంది రాజబాబు ఉన్నారు.

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం కోసం స్థల పరిశీలన

ఏటూరునాగారం, మార్చి 21 : స్థానిక ఐటీఐ ఆవరణలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ నిర్మించతలపెట్టిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం కోసం గురువారం స్థల పరిశీలన చేశారు. టాటా కంపెనీకి చెందిన బసవరాజు బృందం సెంటర్‌కు అవసరమైన స్థలాన్ని చూశారు. వసతులపై ఐటీఐ ప్రిన్సిపాల్‌తో చర్చించారు. వారివెంట ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, శేఖర్, ట్రైనింగ్ అధికారి డీ శ్రీనివాస రావు, ఏటీవోలు మువిన్‌కుమార్, నరేశ్, పీ శ్రీనివాస్ ఉన్నారు.

ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ పూజలు

ఏటూరునాగారం, మార్చి 21 : మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో శిఖర పునఃప్రతిష్ఠ సందర్భంగా గురువారం సాయంత్రం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వస్తి వాచనం, గణపతి పూజ, మండపారాధన, చండీ హోమం నిర్వహించచారు. కార్యక్రమంలో అర్చకులు నాగేశ్వర్‌రావు శర్మ, మురళీమోహన్, మణిశర్మ, హయగ్రీవాచారి, రామాలయం కమిటీ సభ్యులు, కార్యక్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మల్లూరులో గుప్త నిధుల తవ్వకాలు

గుప్త నిధుల కోసం తీసిన గుంత

మంగపేట, మార్చి 21 : మండలంలోని మల్లూరు గుట్ట పరిసర ప్రాంతాల్లో బుధవారం గుప్త నిధుల కోసం జరిపిన తవ్వకాలు వెలుగు చూశాయి. ఈ విషయం తెలుసుకున్న మంగపేట పోలీసులు పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నది. ఈ విషయమై ఎస్సై రవికుమార్‌ను వివరణ కోరగా తవ్వకాల విషయం తమ దృష్టికి వచ్చింది. కానీ, ఇందులో ఎవరి ప్రమేయం ఉందనేది తేలాల్సి ఉందన్నారు. శతాబ్దాల కాలంగా మల్లూరు గుట్టపై ఆయా ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇష్టారాజ్యంగా గుప్త నిధుల తవ్వకాలు జరిపి పురాతన ప్రాచీన రాతి కట్టడాల ఆనవాళ్లు లేకుండా చేసిన విషయం విదితమే.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈవో

గణపురం, మార్చి 21 : మండలకేంద్రంలోని మోడల్ పాఠశాల పరీక్ష కేంద్రాన్ని గురువారం డీఈవో ఎన్ రాంకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు కల్పించామని, పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

ప్రాజెక్ట్ ఆఫీసర్ భిక్షమయ్యకు సన్మానం

భూపాలపల్లి రూరల్, మార్చి 21: భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని ఓసీ-3 గని ప్రాజెక్ట్ ఆఫీసర్ భిక్షమయ్యను గురువారం ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఓసీ-3 గని సమస్యలపై వారు ప్రాజెక్ట్ ఆఫీసర్‌తో చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ గాజర్ల హరికృష్ణ, నాయకులు సదయ్య, శ్రీనివాస్, రాము, చేరాలు, కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు పాటించాలి

మహదేవపూర్, మార్చి 21 : ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని సూరారం అటవీ ప్రాంతంలో చేపట్టిన కందకం పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశాల్లో టెంట్లు వేయాలని, చల్లని తాగునీరు, ఓఆర్ఓఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో రమేశ్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

మూడో రోజు టెన్త్ పరీక్షలు ప్రశాంతం

భూపాలపల్లి రూరల్, మార్చి 21: భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా గురువారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో ఎన్ రాంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ పరీక్షకు 3,544 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 3,529 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, సింగరేణి పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఎస్పీ కిరణ్ ఖరే, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారని తెలిపారు. సమగ్ర శిక్షణ డైరెక్టర్, రాష్ట్ర స్థాయి పరిశీలకులు పీ రాజీవ్ కాటారం, మహదేవపూర్ మండలాల్లోని ఐదు పరీక్ష కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు డీఈవో తెలిపారు.

విద్యార్థులకు మాస్కుల పంపిణీ

గోవిందరావుపేట, మార్చి21 : మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సామాజిక కార్యకర్త తుమ్మల రామకృష్ణ మాస్కులు పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం వర్షం పడటంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలో భాగంగా మాస్కులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

రక్షణ చట్టాలపై అవగాహన

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

తాడ్వాయి, మార్చి21 : బాల్య వివాహాల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల రక్షణ చట్టాలపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో గురువారం జనగలంచ గొత్తికోయగూడెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ బండారి జ్యోతి మాట్లాడారు. బాల్య వివాహాలు చేసినా, పిల్లలపై లైంగికదాడికి పాల్పడినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలో నిస్సహాయక స్థితిలో ఉన్న 13మంది పిల్లలకు స్పాన్సర్ షిప్ వస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో బాలసదనం ప్రారంభమైందని, అనాథ పిల్లలను అందులో చేర్పిస్తే చదివించే అవకాశం ఉందని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలిగినా 1098, 112 నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సహాయం అందుతుందన్నారు.

90శాతం సర్వే పూర్తి

మాట్లాడుతున్న అప్పయ్య

ములుగురూరల్, మార్చి 21 : జిల్లాలో 11 రోజుల పాటు చేపట్టిన కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే గురువారం నాటికి 90శాతం పూర్తయినట్లు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య తెలిపారు. జిల్లాలో 2,67,728మందిని పరీక్షించగా ఇందులో 715మంది అనుమానితులను గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరికి వ్యాధి నిర్ధారణ అయిందన్నారు. మిగిలిన మూడు రోజుల్లో 100శాతం సర్వే పూర్తి చేసేందుకు వైద్యాధికారులు, లెప్రసీ నోడల్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ అనుమానితులకు శరీరంపై మొద్దుబారిన మచ్చలు ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

అడవులను సంరక్షించుకోవాలి

డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్

తాడ్వాయి / ఏటూరునాగారం/ ములుగు రూరల్, మార్చి 21 : మానవ మనుగడకు ముఖ్యమైన అడవులను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. ప్రపంచ అటవీదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తాడ్వాయి అటవీ శాఖ కార్యాలయం నుంచి సమ్మక్క, సారలమ్మల ఆర్చిగేట్ వరకు టెరిటోరియల్ రేంజ్ అధికారి కోట సత్తయ్య, వైల్డ్‌లైఫ్ రేంజ్ అధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో, ఏటూరునాగారం క్రాస్ రోడ్డులోని డివిజన్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ఏటూరునాగారం సౌత్ రేంజ్ ఆఫీసర్ నరేందర్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ చెట్లను పెంచడం ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలన్నారు.

అనంతరం ములుగు ప్రభుత్వ పాఠశాల, తాడ్వాయి మండలం ఇందిరానగర్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు అటవీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలో ములుగు జిల్లాలో అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగి ఉందని, దీనిని కాపాడుకునేందుకు ప్రజలు తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్‌డీవో జోగేందర్, ఎఫ్ఆర్వోలు శంకర్, ఎల్లయ్య, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవికుమార్, సూపరింటెండెంట్ శ్రీధర్, వేణు, ప్రేమ్‌కుమార్, ఎఫ్ఎస్‌వో లక్ష్మీనర్సయ్య, ఏటూరునాగారం సౌత్‌రేంజ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రహ్లాద్, సెక్షన్ ఆఫీసర్లు రవీందర్, రవి, ప్రభాకర్, బీట్ ఆఫీసర్లు దయానంద్, సాగర్, రవికాంత్, శ్రీను, అమీర్, పాషా, శ్రీనాథ్, రాజు, రమేశ్, రఘురాం, సుధాకర్, జ్యోతి, సుమలత, అనూష, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీజీఈని వెంటనే సస్పెండ్ చేయాలి

గణపురం, మార్చి 21 : మండలంలోని నలుగురు విద్యార్థుల డిబార్‌కు కారణమైన ఏసీజీఈ మండల రవీందర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని విధుల నుంచి తొలగించాలని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం విద్యార్థులు హిందీ పరీక్ష రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలోని ఎంఈవో దేవానాయక్, మల్టర్ డీటీ సుంకరీ శ్రీనివాస్ పరీక్ష కేంద్రంలో తిష్టవేసి రెండు గంటల పాటు విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, చిట్టీలు ఉన్నాయని తనిఖీలు చేశారన్నారు. ఏసీజీఈ మండల రవీందర్‌రెడ్డి అండదండలతోనే ఇలా చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి రవీందర్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేసి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దయాకర్, రాధాకృష్ణ, భాస్కర్, హరీశ్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ రాష్ట్ర కోచ్‌గా కుమారస్వామి

ఏటూరునాగారం, మార్చి 21 : మధ్యప్రదేశ్‌లో ఈనెల 23నుంచి 27వరకు నిర్వహించే 45వ జాతీయ హ్యాండ్ బాల్ జూనియర్ బాలుర చాంపియన్ షిప్ పోటీలకు మండలకేంద్రానికి చెందిన పర్వతాల కుమారస్వామిని రాష్ట్రం నుంచి కోచ్‌గా నియమించినట్లు హ్యాండ్‌బాల్ పోటీల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర హ్యాండ్ బాల్ రెఫరీ బోర్డు చైర్మన్ కే ఇంద్రసేనారెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వరంగల్ జోనల్ ఇన్‌చార్జిగా సురేందర్

ములుగురూరల్, మార్చి 21 : బీజేపీ ఎస్టీ మోర్చా వరంగల్ జోనల్ ఇన్‌చార్జిగా జిల్లా కేంద్రానికి చెందిన కొత్త సురేందర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్ ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తనకు బాధ్యతలు అప్పగించిన కిషన్‌రెడ్డి, కల్యాణ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంకు సురేందర్ ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా భూనీలా సమేత వేంకటేశ్వరుడి కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కాటారం, మార్చి 21: భూనీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. మండలంలోని ఒడిపిలవంచలో నిర్వాహకులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను తీసుకొని రాగా వేద పండితులు ఉత్సవమూర్తులకు కల్యాణ తంతు నిర్వహించారు. భక్తులకు మూల సువర్ణ-అమరేందర్‌రెడ్డి, మహేశ్, పూర్ణేశ్, బక్కిరెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. కల్యాణంలో వేదపండితులు నాగరాజుశర్మ, దేవాలయ వ్యవస్థాపకుడు కర్రు నాగయ్య, నిర్వాహకులు కర్రు నారాయణ, నరి వెద్ది సత్యనారాయణ, రాంనారాయణ, రాజేశ్, రమేశ్, రాకేశ్, మధుకర్, సతీశ్, సుబ్బారావు, ప్రభాకర్, రితీశ్, సతీశ్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉత్పత్తులు, నాణ్యతపై అవగాహన

కాటారం, మార్చి 21 : కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) రిసోర్స్ పర్సన్, రిటైర్డ్ డీఎస్‌వో గాంధారి ప్రభాకర్ వివిధ రకాల ఉత్పత్తులు, వాటి నాణ్యతా ప్రమాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాల్లో ఒకటైన 'ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నలుగురు విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఆర్ పూజిత, ఎం శరణ్య రూ.1000, ద్వితీయ బహుమతి ఎస్‌లోహిత, సంజన రూ.750, తృతీయ బహుమతి శివకేశ్, ఎల్ చరణ్ రూ.500 నగదు పురస్కారం అందజేశారు. ఈ సదస్సులో కే కిరణ్ భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ ఏ గోవర్ధన్, ఈసీఈ హెడ్ బీ రాంమోహన్‌రెడ్డి, లెక్చరర్లు జీ సరళకుమారి, కరుణ శ్రీ, పూర్ణ సాయికిరణ్, వాణి, రజిత పాల్గొన్నారు.

కోటగుళ్లలో తెలంగాణ రీజినల్ కమాండెంట్ ప్రత్యేక పూజలు

కోటగుళ్లలో పూజలు చేస్తున్న తెలంగాణ రీజినల్ కమాండెంట్ రామశేషమూర్తి

గణపురం, మార్చి 21 : కాకతీయుల కళాక్షేత్రం భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో గురువారం సాయంత్రం తెలంగాణ రీజినల్ కమాండెంట్ ఇసుకపల్లి రామశేషమూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు నరేశ్ అర్చన, అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.

శాంతిభద్రతల పరిరక్షణ పౌరుల బాధ్యత

గణపురం, మార్చి 21 : శాంతిభద్రతల పరిరక్షణ పౌరుల బాధ్యత అని, పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు యువత, రాజకీయ నాయకులు సహకరించాల